సాక్షి కామారెడ్డి

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024

I



బయోమెట్రిక్ ద్వారా విక్రయం

రైతుల బయోమెట్రిక్ వివరాలు తీసుకుని ఎరువులను విక్రయించాలని డీఏవో భాగ్యలక్ష్మి సూచించారు.

- IIలో ▸



'పోడు'ను పరిష్కరిస్తాం

పోడు భూముల సమస్య పరిష్కారానికి అటవీ, రెవెన్యూ అధికారులు సహకరించాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కోరారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
33.7 /14.3

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మేడారం జాతరకు ప్రత్యేక రైళ్లు

- 21 నుంచి 24వ తేదీ వరకు నడవనున్న రైల్వేశాఖ

కాజీపేట రూరల్(వరంగల్): మేడారం సమ్మక్క – సారలమ్మ మహా జాతర సందర్భంగా ప్రత్యేక రైళ్లు నడవనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 24 వరకు నిజామాబాద్ – వరంగల్– నిజామాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుస్తాయని పేర్కొన్నారు. నిజామాబాద్–వరంగల్ (07019) ఎక్స్‌ప్రెస్ నిజామాబాద్‌లో ఉదయం 7:05 గంటలకు బయలుదేరి వరంగల్‌కు మధ్యాహ్నం 1:45 గంటలకు చేరుకుంటుంది. అదేవిధంగా వరంగల్–నిజామాబాద్ (07020) ఎక్స్‌ప్రెస్ వరంగల్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు బయలుదేరి రాత్రి 10:30 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుంటుంది.

రేపు ఔషధీయ మట్టి స్నానాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పెద్ద చెరువు గంగమ్మ దేవాలయం వద్ద ఆదివారం ఉదయం 8 గంటలకు ఔషధీయ మట్టి స్నానాలు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యోగా రాంరెడ్డి, యోగాచార్యులు జి.అంజయ్య గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు 94400 37948 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వలకు చిక్కిన భారీ చేప



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులో జాలరి వలకు ఓ భారీ చేప చిక్కింది. హసన్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మణ్ శుక్రవారం సాయంతం నిజాంసాగర్ ప్రాజెక్టు హెడ్‌స్లూయిస్ ప్రాంతంలో చేపలు పడుతుండగా భారీ చేప వలలో పడింది. దానిని తూకం వేయగా 21 కిలోల బరువుంది.

నేడు 'వన్ డిస్ట్రిక్ట్ -వన్ ఎగ్జిబిషన్'

డొంకేశ్వర్(ఆర్మూర్): తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ), నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డు) సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్–వన్ ఎగ్జిబిషన్' ప్రదర్శనను జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో శనివారం ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయం, నీటిపారుదల, వ్యర్థాల నిర్వహణ, పాడి పరిశ్రమ, గ్రామీణాభివృద్ధి తదితర అంశాల్లో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించేందుకు మార్కెట్‌కు సిద్ధంగా ఉన్న తక్కువ ధర ఆవిష్కణలు ఉంటాయన్నారు. ఇందులో 30మంది పల్లె సృజన ఆవిష్కర్తలు పాల్గొని, మార్కెటింగ్ సౌలభ్యం, వ్యాపారాల అవకాశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే నడపాలి

బోధన్: మూతపడిన నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీ లిమిటెడ్(ఎన్డీఎస్ఎల్)ని తెరిపించి ప్రభుత్వమే నడపాలని ఎన్డీఎస్ఎల్ కార్మిక సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు నియమించిన కమిటీ త్వరలో బోధన్‌కు రానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం బోధన్ ఫ్యాక్టరీ ప్రధాన గేట్ ఎదుట కార్మిక సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. కార్మికుల సమస్యలు కమిటీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు నాయకులు తెలిపారు.

బల్దియా హస్తగతమయ్యేనా?

- కామారెడ్డిలో కారు దిగుతున్న కౌన్సిలర్లు
- మూడు నెలల్లో బీఆర్ఎస్‌కు 17 మంది రాజీనామా
- మున్సిపాలిటీలో 22కు చేరిన కాంగ్రెస్ సభ్యుల బలం
- చైర్‌పర్సన్‌ను గద్దె దించేందుకు ప్రయత్నాలు
- అవిశ్వాసం వైపు వేగంగా అడుగులు

కామారెడ్డి మున్సిపాలిటీలో సమీకరణాలు మారిపోతున్నాయి. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఒక్కరొక్కరుగా హస్తం గూటికి చేరుతున్నారు. మూడు నెలల్లోనే 17 మంది కౌన్సిలర్లు కారు దిగి.. కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మరో ముగ్గురు సభ్యుల మద్దతు దొరికితే ప్రస్తుత బల్దియా చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలన్న యోచనలో అధికార పార్టీ నేతలున్నట్లు తెలుస్తోంది.





షబ్బీర్ అలీని కలిసిన కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు (ఫైల్)

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. కామారెడ్డి బల్దియాను చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. బీఆర్ఎస్ కౌన్సిలర్లను తనవైపు తిప్పుకుంటోంది. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 23, కాంగ్రెస్ 12, బీజేపీ 8 స్థానాలను గెలుచుకోగా.. ఆరుగురు ఇండిపెండెంట్లు కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. ఇండిపెండెంట్లు బీఆర్ఎస్‌లో చేరడంతో ఆ పార్టీ బలం 29కి చేరింది. దీంతో ఆ పార్టీకి చెందిన నిట్టు జాహ్నవి చైర్‌పర్సన్‌గా, గడ్డం ఇందుప్రియ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం కాంగ్రెస్ నుంచి 8 మంది, బీజేపీ నుంచి ఇద్దరు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరడంతో వారి బలం 39కి పెరిగింది.

పార్టీలో విభేదాలతో..

అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ నేతల్లో నెలకొన్న విభేదాలతో వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియతో పాటు ఆమె భర్త చంద్రశేఖరరెడ్డిలను పార్టీనుంచి బహిష్కరించారు. ఆ మరుసటి రోజే వైస్ చైర్‌పర్సన్‌తో పాటు 16వ వార్డు కౌన్సిలర్ చాట్ల వంశి కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోవడంతోపాటు కామారెడ్డిలోనూ ఓటమి పాలవడంతో బీఆర్ఎస్ నేతలు నిరుత్సాహానికి గురయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కౌన్సిలర్లు ఆ పార్టీవైపు దృష్టి సారించారు. ఒక్కరొక్కరుగా హస్తం గూటికి చేరుతున్నారు. ఇప్పటికే 17 మంది కౌన్సిలర్లతోపాటు ఒక కోఆప్షన్ సభ్యురాలు కాంగ్రెస్‌లో చేరారు. ఒక బీజేపీ కౌన్సిలర్ సైతం హస్తం తీర్థం పుచ్చుకున్నారు. దీంతో పాత వారితో కలిపి కాంగ్రెస్ బలం 22కు చేరింది. మరికొందరు కౌన్సిలర్లు సైతం కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. చైర్‌పర్సన్ స్థానాన్ని ఆశిస్తున్న 10 వ వార్డు కౌన్సిలర్ వనిత, ఆమె భర్త రవి బీఆర్ఎస్ కౌన్సిలర్లతో చర్చలు జరుపుతూ కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు.

చైర్‌పర్సన్‌పై 'అవిశ్వాసం'!

కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై బీఆర్ఎస్ కౌన్సిలర్లలోనే అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ పార్టీకి బల్దియాలో 22 మంది సభ్యులున్నారు. చైర్‌పర్సన్‌పై కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసం పెడితే బీఆర్ఎస్‌కు చెందిన ఎనిమిది మంది సభ్యులు దానికి మద్దతు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. కాగా అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 36 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం అవుతుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌నుంచి మరింతమందిని చేర్చుకునేందుకు అధికార పార్టీ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో బీజేపీ సభ్యుల మద్దతు కూడగట్టే ప్రయత్నాలూ సాగుతున్నాయని సమాచారం. దీంతో కామారెడ్డి బల్దియా రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

జిల్లాలో బదిలీల జాతర

- అన్ని శాఖల్లో అధికారుల మార్పు
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థాన చలనం



సాక్షి, కామారెడ్డి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీల జాతర కొనసాగుతోంది. సొంత జిల్లాలో పనిచేస్తున్న వారితో పాటు మూడేళ్లకుపైగా జిల్లాలో పనిచేసిన అధికారులను ఇతర జిల్లాలకు పంపిస్తున్నారు. వారి స్థానంలో కొత్తవారు జిల్లాకు వస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులతో పాటు డివిజనల్, మండల స్థాయి అధికారుల బదిలీలు జరిగాయి. పోలీస్, రెవెన్యూ శాఖలతో పాటు పంచాయతీ రాజ్, ఎక్సైజ్ శాఖల్లో ఏళ్లగా పనిచేస్తున్న అధికారులను బదిలీ చేశారు. వారి స్థానంలో కొత్తవాళ్లకు పోస్టింగులు ఇచ్చారు. ఆర్డీవోలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు దాదాపు అందరూ బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఇతర జిల్లాల నుంచి తహసీల్దార్లు వచ్చారు. ఇప్పటికే తొంభై శాతానికి పైగా బదిలీలు పూర్తయ్యాయి. మరికొన్ని బదిలీలు రెండు మూడు రోజుల్లో పూర్తవుతాయని భావిస్తున్నారు.

రెవెన్యూ, మున్సిపల్ అధికారులు..

కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రంగనాథ్‌రావ్ అనే అధికారికి పోస్టింగ్ ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా తహసీల్దార్లతోపాటు కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపల్ కమిషనర్లు కూడా బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఇతర జిల్లాలకు చెందిన అధికారులు బదిలీపై వచ్చారు.

పోలీసు శాఖలో..

కామారెడ్డి డీఎస్పీ ప్రకాశ్ బదిలీ అవగా ఆయన స్థానంలో నాగేశ్వర్‌రావ్‌కు పోస్టింగ్ ఇచ్చారు. బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి బదిలీ కాగా.. ఆయన స్థానంలో సత్యనారాయణ వచ్చారు. కామారెడ్డి రూరల్, సదాశివనగర్, ఎల్లారెడ్డి, బిచ్కుంద, భిక్కనూరు, బాన్సువాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. అలాగే పలు పోలీసు స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలకు కూడా స్థానచలనం కలిగింది. పోలీసు శాఖలో దాదాపు జిల్లాలో సగానికిపైగా అధికారులు కొత్తవారే ఉన్నారు. అలాగే ఎక్సైజ్ శాఖలోనూ సీఐలు, ఎస్సైల బదిలీలు జరిగాయి.

పంచాయతీరాజ్ శాఖలో...

జిల్లాలో పంచాయతీరాజ్ శాఖలో జిల్లా, మండల స్థాయి అధికారులు పలువురు బదిలీ అయ్యారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి సాయన్న ఆదిలాబాద్‌కు బదిలీ అవగా, ఆయన స్థానంలో పద్మజారాణి వచ్చారు. అలాగే జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్ నిజామాబాద్‌కు బదిలీ అవగా ఆయన స్థానంలో చందర్ వచ్చారు. ఎంపీడీవోలు పదమూడు మంది ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఆయా జిల్లాల నుంచి వచ్చారు. డీఎల్పీవో సాయిబాబా కూడా బదిలీ అయ్యారు.

'విశ్వకర్మ'పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: సంప్రదాయ చేతివృత్తులు, హస్త కళాకారులకు ఆర్థిక చేయూత అందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంఎస్ఎంఈ, జిల్లా పరిశ్రమల కేంద్రాల ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ పథకంపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేతి, కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచి ఉత్పాదకతను పెంచేందుకు కృషి చేయడం ఈ పథకం ఉద్దేశమన్నారు. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, స్వర్ణకారులు, శిల్పులులాంటి 18 కేటగిరీలలో పని చేస్తున్న చేతివృత్తులు, హస్తకళల వారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పర్యటించి చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారిని గుర్తించి ఈ పథకం ప్రయోజనాలను వివరించాలన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి 5 నుంచి 7 రోజుల ప్రాథమిక నైపుణ్యం, 15 రోజుల అధునాతన నైపుణ్య శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత రూ.15 వేల విలువైన టూల్ కిట్, ధ్రువీకరణ పత్రం అందిస్తామన్నారు. తర్వాత 5 శాతం వడ్డీతో రూ. లక్ష రుణం పొందవచ్చన్నారు. ఈ పథకం కోసం జిల్లాలో ఇప్పటివరకు 6 వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. మరింత మందికి లబ్ధి చేకూరేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ ఏడీ రాజేష్ యాదవ్, పరిశ్రమల శాఖ ఏడీ రఘునాథ్, డీపీవో శ్రీనివాస్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఎస్సెస్సీ, ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరీక్షల ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 28 నుంచి మార్చి 16 వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 9,993 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 9,516 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. వీరికోసం జిల్లాలో 37 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పర్యవేక్షణకు 55 మంది అధికారులను సూపరింటెండెంట్‌లుగా నియమించామన్నారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్, మూడు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఎస్సెస్సీ వార్షిక పరీక్షలను మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 11,962 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతారన్నారు. వీరికోసం జిల్లాలో 62 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పరీక్షలను సాఫీగా నిర్వహించడానికి పరీక్ష కేంద్రాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించామన్నారు. 660 మంది ఇన్విజిలేటర్లు, 64 మంది రూట్ అధికారులు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లను నియమించనున్నామన్నారు. మూడు ఫ్లయింగ్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలలో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్‌లు మూసి వేయించాలని సూచించారు. సీసీ కెమెరాల నిఘాలో కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, డీఈవో రాజు, డీసీఆర్‌బీ డీఎస్పీ మదన్‌లాల్, పరీక్షల సహాయ కమిషనర్ లింగం, జిల్లా ఖజానా అధికారి సాయిబాబా, డిపో మేనేజర్ ఇందిర, తపాలా, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు రుణాలివ్వాలి

కామారెడ్డి క్రైం : బ్యాంకర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం బ్యాంకర్లు, అధికారులతో రుణ లక్ష్యం, పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ. 2,225.30 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగంలో రూ.357.70 కోట్లు, విద్య, గృహ నిర్మాణం తదితర రంగాలకు రూ.136.05 కోట్లు, అప్రధాన్యత రంగాలకు రూ.725.67 కోట్ల రుణాలు అందించామన్నారు. స్వయం సహాయక సంఘాలకు రూ. 501.14 కోట్లు, మెప్మా ద్వారా మరో రూ.48.57 కోట్ల రుణాలను పంపిణీ చేశామన్నారు. 62 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. మిగతా లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి సుధీర్ భార్గవ్, నాబార్డ్ డీసీఎం ప్రవీణ్ కుమార్, ఎస్‌బీఐ ఎల్‌డీవో తేజ బెహ్రా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, పశుసంవర్థక అధికారి సింహరావు, గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాస్, మత్స్య శాఖ ఏడీ వరదారెడ్డి, ఏడీఏ లక్ష్మీ ప్రసన్న, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

'గ్రామీణ' బంద్ ప్రశాంతం



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

కామారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్ శుక్రవారం జిల్లాలో విజయవంతమైంది. జిల్లా కేంద్రంలో సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో వేరువేరుగా ర్యాలీలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన సీఐటీయూ సభలో ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతూ కార్మికులను మోసం చేస్తోందంటూ కేంద్ర ప్రభుత్వంపై మండి పడ్డారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘాలు విద్యా సంస్థలను బంద్ చేయించాయి. ఆయా కార్యక్రమాలలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ ఉద్యోగులు, మున్సిపల్, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

'మహిళలు, బాలల సంరక్షణకు భరోసా కేంద్రం'



కామారెడ్డిలోని గ్రీన్‌హోమ్స్ కాలనీలో భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం: బాధిత మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించడంతో పాటు వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం కోసం ప్రభుత్వం భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. కలెక్టరేట్‌కు సమీపంలోని గ్రీన్ హోమ్స్ కాలనీలో ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురైన మహిళలు, బాలికలను ఆస్పత్రులు, పోలీసు స్టేషన్‌లకు దూరంగా చక్కని వాతావరణంలో ఉంచి వైద్యం, న్యాయ సేవలు, కౌన్సెలింగ్‌లాంటి సేవలు అందించడానికి దీనిని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సింగ్, సీఐలు రామన్, సుభాష్, ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



పోచారంప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేసే గేట్లను పరిశీలిస్తున్న ఓయూ విద్యార్థులు

పోచారం ప్రాజెక్టు సందర్శన

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టును శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు సందర్శించారు. ఓయూలో బ్యాచ్‌లర్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న 53 మంది విద్యార్థులు శుక్రవారం ప్రొఫెసర్స్ రాజశేఖర్, రాధికల ఆధ్వర్యంలో ప్రాజెక్టు సందర్శనకు వచ్చారు. ప్రాజెక్టు ఆవరణలో ఉన్న రెండు అతిథి గృహాలను పరిశీలించారు. ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లుతో మాట్లాడి ప్రాజెక్టు నిర్మాణం గురించి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం, అలుగు పొడవు, లోతు తదితర వివరాలను డీఈఈ వివరించారు. ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే గేట్లను, ప్రధాన కాలువను విద్యార్థులు పరిశీలించారు.

'క్రమం తప్పకుండా లైబ్రరీని సందర్శించాలి'



రిసోర్స్ పర్సన్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

కామారెడ్డి అర్బన్: విద్యార్థులు పుస్తకాలను చదివే అలవాటును పెంపొందించుకోవాలని, క్రమంతప్పకుండా గ్రంథాలయాన్ని సందర్శించాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం కళాశాల ఆడిటోరియంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ ఆధ్వర్యంలో 'ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ రిసోర్సెస్' అంశంపై డిగ్రీ, పీజీ విద్యార్థులు, అధ్యాపకులకు ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. నల్గొండ నాగార్జున ప్రభుత్వ కళాశాల లైబ్రరీ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. విజ్ఞానం, వినోదం, సాంకేతిక పరిజ్ఞానం అంశాలతో రిసోర్స్ ఎలా పొందాలనే అంశంపై వివరించారు. ఈ–బుక్స్, ఈ–జర్నల్స్, ఈ–మ్యాగజైన్స్ గురించి అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, పరీక్షల నియంత్రణ అధికారి రామకృష్ణ, గ్రంథాపాలకుడు లక్ష్మణాచారి, ఐక్యూఏసీ సమన్వయకర్త చంద్రకాంత్, అధ్యాపకులు రాజ్‌కుమార్, గణేష్, రాజ్ గంభీర్‌రావు, రాజేందర్, శారద, శ్రీనివాస్, చంద్రశేఖర్‌గౌడ్, తిరుమల, సుచరణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. గురువారం నాటికి 2లక్షల 92వేల 349 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు



ఎల్లారెడ్డి : మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబుతో బాధపడకుండా ముందుగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఉచితంగా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్లు ఎస్.సంగీత, ఫార్మాసిస్ట్ రవితేజ, ఏఎన్ఎం సునీత స్టాఫ్‌నర్స్ సంయుక్త, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'గృహజ్యోతి' వివరాల నమోదు



కామారెడ్డి అర్బన్ : గృహజ్యోతికి సంబంధించి లబ్ధిదారుల వివరాలను శుక్రవారం వ్యాలిడేషన్ చేశారు. శుక్రవారం చివరి రోజు అని ప్రకటించడంతో అధికారులు ఆయా వీధుల్లో తిరిగి తప్పిపోయిన ఇళ్లను నమోదు చేశారు. పట్టణంలోని 10, 34, 35, 36 వార్డుల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణ్ తెలిపారు. లైన్‌మెన్‌లు, బీజేపీ నాయకుడు ఆకుల భరత్‌కుమార్, బీఆర్ఎస్ నాయకుడు పంపరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోడు సమస్యను పరిష్కరిస్తాం

- అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు
- తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



జుక్కల్‌లో అధికారులతో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్) : పోడు భూముల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, అటవీశాఖల అధికారులు సహకరించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సూచించారు. తాత, ముత్తాతల కాలం నుంచి పంటలు సాగు చేస్తూ, పట్టా పాసుబుక్కులు కల్గిన రైతులకు న్యాయం చేయాలన్నారు. శుక్రవారం జుక్కల్ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో అటవీ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ధరణి పట్టాదారు పాసు బుక్కులు రాని పట్టాదారు రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. కొత్తగా అడవులను నరికేసి కబ్జా చేసుకున్న వారికి కాకుండా నిబంధనల ప్రకారంగా భూ కబ్జాలో ఉన్న రైతులకు పోడు పట్టాలు అందించాలన్నారు. అడవులను నరికేస్తూ, భూ కబ్జాలకు పాల్పడుతున్న వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వజ్రకండి, డోన్‌గాం గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంత శివారులో భూములు కబ్జా కాకుండా కందకాలు తవ్వాలని అధికారులకు ఆదేశించారు. అలాగే మద్నూర్ మండలంలోని లచ్చన్ ప్రాంతంలో ఉన్న వెయ్యి ఎకరాల అటవి భూమిలో చెట్లు పెంచేందుకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ ప్రతీ ఇంటింటికీ సురక్షితమైన జలాలను అందించాలని, తాగునీటి ఎద్దడి రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తాగునీటి ఎద్దడి ఎదురయ్యే గ్రామాలు, గిరిజన తండాల్లో ప్రత్యామ్నాయంగా బోరుబావులను అద్దెకు తీసుకోవడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ప్రతిపాదనలు పంపాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆయన ఆదేశించారు. దళిత బంధు అక్రమార్కులపై అధికారులు తగు చర్యలు తీసుకోని దళితులకు న్యాయం చేయాలని ఆయన సూచించారు. వృద్ధాప్య పింఛన్లు, గొర్రెల పంపిణీకి డీడీలు కట్టినా గొర్రెలు రావడం లేదని ఆయా మండలాల ప్రజలు ఎమ్మెల్యేకు వినతులు అందించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కే రాజేంద్ర కుమార్, ఈఈలు స్వప్న, ఏఈలు రాజశేఖర్‌రెడ్డి, రాచప్ప, సుమలత, ప్రవళిక, గణేశ్ తదితరులు ఉన్నారు.

'22వ ప్యాకేజీ' పూర్తి చేయాలి

- అసెంబ్లీ సమావేశాల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : గత ప్రభుత్వంలో సీఎం హోదాలో కేసీఆర్ రెండుసార్లు తన నియోజకవర్గానికి వచ్చి కాళేశ్వరం 22వ ప్యాకేజీ ద్వారా నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు నీరందిస్తామన్నారని, కాని ఇప్పటివరకు తట్టెడు మట్టిపని కూడా జరగలేదని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించారు. నియోజవర్గంలో 95శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నారన్నారు. 22ప్యాకేజీ పనులు పూర్తయ్యేలా చూడాలని ఆయన నీటిపారుదలశాఖ మంత్రిని కోరారు. దీంతోపాటు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఇళ్లు లేక చాలామంది నిరుపేదలు పాములు, తేళ్లతో సహవాసం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గకేంద్రమైన ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గైనకాలజిస్ట్, అనస్తీషియా లేకపోవడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని, ఈ సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

బయోమెట్రిక్ ద్వారా ఎరువులు విక్రయించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి



తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి భాగ్యలక్ష్మి

బిచ్కుంద(జుక్కల్) : రైతుల బయోమెట్రిక్ (ఈపీవోఎస్), ఆధార్ కార్డు తీసుకొని ఎరువులను విక్రయించాలని లేకపోతే ఫర్టిలైజర్ షాపులపై చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం మండలంలో మండలంలోని పుల్కల్, శాంతాపూర్ సొసైటీ, బిచ్కుంద, ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. దుకాణాలలో ఎరువుల స్టాక్ రిజిస్టర్ తప్పకుండా ఉండాలన్నారు. క్రయ,విక్రయాల పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచించారు. రైతులకు ఒరిజినల్ బిల్లులు ఇవ్వాలని, నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కందర్‌పల్లిలో రైతులకు మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు క్రాఫ్ బుక్కింగ్ అందరు తప్పకుండా చేసుకోవాలని సూచించారు. ఏవో రాజలింగం, ఏఈవోలు పాల్గొన్నారు.

డీఎల్‌పీవోకు సన్మానం



కామారెడ్డి క్రైం : అంకితభావంతో పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందుతారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి డీఎల్‌పీవోగా పనిచేసి బదిలీపై బోధన్‌కు వెళ్తున్న సాయిబాబాను కామారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. సేవా భావంతో పనిచేసి ప్రజల్లో గుర్తింపు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీవో శ్రీనివాసరావు, జెడ్పీ సీఈవో చందర్, ఎల్లారెడ్డి, కామారెడ్డి డీఎల్‌పీఓలు సురేందర్, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యంపై విద్యార్థులకు అవగాహన



కామారెడ్డి టౌన్ : జీవన నైపుణ్యం అంశంపై జిల్లా కేంద్రంలోని పీజేఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు తెయూ ప్రొఫెసర్ డాక్టర్ బి అంజయ్య హాజరై అవగాహన కల్పించారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవాలని, డిప్రెషన్‌ను గురికావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గురేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి అయ్యప్పస్వామి ఆలయం వార్షికోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా అయ్యప్పస్వామి వారికి అష్టాభిషేకం, క్షీరాభిషేకం, శతకలాభిషేకంతో పాటు పుష్పాభిషేకం, ఉంజల్‌సేవ నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్నదానం చేశారు. స్వామి అయ్యప్పసేవా సంఘం, అయ్యప్ప అన్నప్రసాద సేవా సమితి, అయ్యప్ప అన్నదాన సేవా సమితి ప్రతినిధులు, అయ్యప్పభక్తులు, మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం పూట దీపాలంకరణ నిర్వహించారు.

పాఠశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

బాన్సువాడ : అనుమతి లేని ప్రదేశంలో పాఠశాలలు నిర్వహిస్తున్న వారిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని లంబాడ స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీవన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలకు అనుమతి ఒకదగ్గర తీసుకుని మరోచోట నిర్వహిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో అడ్మిషన్లు ఇప్పించి బాన్సువాడ పట్టణంలో కోచింగ్ సెంటర్లలో నవోదయ, సైనిక్ తదితర కోచింగ్ ఇస్తూ రూ.లక్షలాది ఫీజులు వసూలు చేస్తున్నారని దీనిపై సమగ్ర విచారణ చేయించాలన్నారు.

కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్లు



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మున్సిపల్‌కు నూతనంగా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కే సుజాతను పలువురు కౌన్సిలర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ అధాయ పెంపు, అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కౌన్సిలర్ తరపున అన్ని విధాల సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కన్నయ్య, అంజల్‌రెడ్డి ఉన్నారు.

'దాబాల్లో మద్యం సేవించరాదు'

గాంధారి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలో ఎక్కడైనా హోటళ్లు, దాబా హోటళ్లలో మద్యం విక్రయించడం, మద్యం సేవించడం నిషేధమని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. హోటళ్ల నిర్వాహకులతో పాటు, సేవించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ విషయాన్ని అందరూ గమనించి సహకరించాలని ఎస్సై కోరారు.

హోంగార్డు మృతికి సంతాపం



కామారెడ్డి క్రైం : అనారోగ్య కారణాలతో పట్టణం లోని శ్రీరాంనగర్‌కు చెందిన హోంగార్డు సంజీవ్ (44) మృతి చెందిన విషయం తెలిసిందే. అతని మృతదేహానికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా పోలీసుశాఖ లోని రిజర్వ్ విభాగం సీఐ క్రిష్ణ, ఇతర పోలీసు సిబ్బంది అంత్యక్రియలకు హాజరై సంతాపం వ్యక్తం చేశారు. హోంగార్డు కుటుంబ సభ్యులను పరిమర్శించి అతని కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

దోమకొండ: మండల కేంద్రంలోని బీబీపేట రోడ్డులో శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొని గ్రామానికి చెందిన గాండ్ల రాములు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. రాములు తన బైక్‌ను వెనుకకు తీసే క్రమంలో దుబ్బాక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తగిలింది. గాయాలపాలైన రాములను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై గణేశ్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మాక్లూర్: మండల కేంద్రంలోని చింతల చెరువు సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడినవారి నుంచి రూ.6వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

విద్యార్థులకు అస్వస్థత

నవీపేట: మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. పదోతరగతికి చెందిన ఇద్దరు విద్యార్థినులు మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత వాంతులు చేసుకున్నారు. వెంటనే విద్యార్థినులను ప్రైవేట్ నర్సింగ్‌హోంకు తరలించి చికిత్స అందించారు. కోలుకున్న తరువాత విద్యార్థినులను డిశ్చార్జి చేశారు.

పర్మిట్ రూములో ఒకరి మృతి



వైన్స్ ఎదుట ఆందోళన చేస్తున్న మోటాట్‌పల్లి గ్రామస్తులు



సాయిలు మృతదేహం

భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర వైన్‌షాప్ పర్మిట్ రూములో ఓ వ్యక్తి మృతి చెందాడు. మోటాట్‌పల్లి గ్రామానికి చెందిన తూర్పాటి కుర్మ సాయిలు (55) గురువారం సాయంత్రం తన బైక్‌పై వచ్చి పర్మిట్‌రూమ్‌లో మద్యం సేవిస్తూ కూర్చున్నాడు. వైన్స్ నిర్వాహకులు రాత్రి పదిగంటలకు వైన్‌షాప్ మూసి పర్మిట్ రూమ్‌ను మూసివేసేందుకురాగా, సాయిలు మద్యం సేవిస్తూ కూర్చున్నాడు. బయటికి వెళ్లాలని దుకాణం నిర్వాహకులు సూచించగా, ఒక్కగ్లాస్ తాగి వెళ్తానని చెప్పడంతో వారు వెళ్లిపోయారు. తరువాత్ వాచ్‌మెన్ కూడా సాయిలును వెళ్లిపోవాలని సూచించగా, ఇంకో క్వార్టర్ తీసుకురావాలని డబ్బులు ఇచ్చాడు. వాచ్‌మెన్ క్వార్టర్ తీసుకువచ్చి ఇవ్వడంతో అక్కడే మద్యం సేవిస్తూ కూర్చున్నాడు. సాయిలు ఉన్న విషయం వాచ్‌మెన్ మరిచిపోయాడు. శుక్రవారం పొద్దున వైన్‌షాప్ నిర్వాహకులు వచ్చి చూడగా సాయిలు మృతి చెంది కనిపించాడు. వెంటనే యజమానితోపాటు పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న మోటాట్‌పల్లి గ్రామస్తులతో పాటు స్థానికులు పెద్దఎత్తున వైన్‌షాప్ వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. వైన్స్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా సాయిలు మృతి చెందాడని మధ్యాహ్నం రెండుగంటల వరకు ఆందోళన చేశారు. సమయం ముగిసిన తరువాత మద్యం విక్రయించడం కారణంగానే సాయిలు మృతి చెందాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చివరకు వైన్స్ యాజమాన్యం బాధిత కుటుంబానికి రూ.2.30లక్షలు ఇచ్చేలా స్థానిక నాయకులు ఒప్పించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు ప్రాంతాలకు చెందిన నలుగురు అదృశ్యం



గడ్డమీది రాజు (ఫైల్)

కామారెడ్డి క్రైం: రామాయంపేట మండలం దొంగల ధర్మారం గ్రామానికి చెందిన గడ్డమీది రాజు అనే యువకుడు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 13న కామారెడ్డి నుంచి ముంబయి వెళ్లిన రాజు.. ఈ నెల 15న కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా, ఇప్పుడే కామారెడ్డిలో రైలు దిగి బస్టాండ్‌కు వెళ్తున్నట్లు చెప్పాడు. ఆ తర్వాత నుంచి అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు రాజుతో వెళ్లిన వారిని ఆరా తీయగా, కామారెడ్డి బస్టాండ్ వద్ద ఆటోలో నుంచి దిగాడని చెబుతున్నారు. అతడి ఆచూకీ లభించకపోవడంతో తండ్రి స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లిన యువతి..

జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. కాలనీకి చెందిన సానియా 8 నెలల క్రితం బయటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె తన తల్లి ఖైరున్నీసాతో ఫోన్‌లో మాట్లాడేది. వారం రోజులుగా ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండడంతో తల్లి తన కూతురి ఆచూకీకోసం పలుచోట్ల వెతికి చివరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఎల్లారెడ్డికి చెందిన వ్యక్తి



రుడావత్ గణేశ్ (ఫైల్)

ఎల్లారెడ్డి : మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్ తండాకు చెందిన రుడావత్ గణేశ్(36) అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న గణేశ్ ఈనెల 10న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాపీ మేస్త్రీ..

ధర్పల్లి: ప్రకాశం జిల్లా పెద్దవార్లపాడు గ్రామానికి చెందిన దొడ్డ యేసయ్య అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. యేసయ్య తన కొడుకుతో కలిసి ధర్పల్లి మండల కేంద్రంలో మేస్త్రీ పనులు చేసుకుంటున్నాడు. నెల రోజుల క్రితం సంక్రాంతి పండుగకు కుటుంబ సభ్యులు సొంతూరుకు వెళ్లగా, యేసయ్య మాత్రం ఇక్కడే ఉండిపోయాడు. పండుగ తరువాత ధర్పల్లికి వచ్చిన కుటుంబ సభ్యులకు యేసయ్య కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికారు. యేసయ్య కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డొంకేశ్వర్ వైన్‌షాప్‌లో తనిఖీలు

- వేర్వేరుగా విచారించిన ఎక్సైజ్, పోలీసు అధికారులు



మద్యం శాంపిళ్లను పరీక్షిస్తున్న ఎక్సైజ్ అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలోని వైన్‌షాప్‌ని అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచడంతోపాటు మద్యాన్ని కల్తీ చేస్తున్నారని ఆరోపణలు రావడంతో మద్యం దుకాణంలో ఎక్సైజ్ అధికారులు, పోలీసులు శుక్రవారం వేర్వేరుగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా నిజామాబాద్ ఎక్సైజ్ సీఐ దిలీప్, ఎస్సై మల్లేశ్ మద్యం శాంపిళ్లను పరీక్షించారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. మద్యాన్ని కల్తీ చేస్తే రూ.5లక్షల జరిమానా విధిస్తామని, లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ అధికారులు వెళ్లిన తర్వాత స్థానిక పోలీసులు వైన్సులో తనిఖీలు చేపట్టారు. ఎస్సై రాహుల్ సీసీ ఫుటేజీని పరిశీలించారు. నిర్ణీత సమయం ముగిసిన తరువాత వైన్స్ తెరిచి ఉంచితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నికాల్‌పూర్‌లో బెల్టు షాపు సీజ్

నికాల్‌పూర్‌లో నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని విక్రయిస్తున్న బెల్టు దుకాణంపై దాడులు నిర్వహించి సీజ్ చేసినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ.10వేల విలువ చేసే మద్యాన్ని సీజ్ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని తెల్గాపూర్, సింగితం అటవీ ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం రాత్రి పట్టుకున్నట్లు బాన్సువాడ రేంజ్ అధికారి అబీబ్ తెలిపారు. వాల్టా చట్టాన్ని అతిక్రమించి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. ట్రాక్టర్ల యజమానులకు జరిమానా విధించి కేసు నమోదు చేస్తామన్నారు.

కిడ్నాపర్‌గా భావించి మహిళపై దాడి



భిక్కనూరు: పిల్లలను కిడ్నాప్ చేసే వ్యక్తి అనుకొని మతిస్థిమితం లేని మహిళలను మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామస్తులు శుక్రవారం చితకబాదారు. దోమకొండ మండల కేంద్రానికి చెందిన మతిస్థిమితం లేని లక్ష్మి అనే మహిళ దోమకొండ నుంచి పెద్దమల్లారెడ్డికి ఆటోలో వచ్చింది. అక్కడ ఆటో దిగిన అనుమానాస్పదంగా వ్యవహరించడంతో పలువురు ప్రశ్నించారు. సరైన సమాధానం ఇవ్వకపోడంతో గ్రామస్తులు చితకబాదారు. ఘటనకు సంబంధించి సమాచారం అందడంతో పోలీసులు గ్రామానికి చేరుకొని సదరు మహిళను పోలీస్ స్టేషన్‌కు తరలించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. లక్ష్మి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆమెను తమవెంట తీసుకెళ్లారు.

మూడో అంతస్తు పైనుంచి పడి మృతి

బాన్సువాడ రూరల్ : పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో గణేశ్ (30)అనే మేస్త్రి మూడో అంతస్తు పైనుంచి పడి మృతి చెందాడు. బిచ్కుంద మండలం శాంతాపూర్‌కు చెందిన గణేశ్ కొంత కాలంగా బాన్సువాడలోని ఓ కాంట్రాక్టర వద్ద పని చేస్తున్నాడు. శుక్రవారం పని చేస్తుండగా మూడో అంతస్తు పైనుంచి జారిపడ్డాడు. వెంటనే అతడిని వెంటనే బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే గణేశ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, మూడు నెలల కూతురు ఉన్నారు. బాధితుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ కృష్ణ తెలిపారు.

ముదిరిన ఫ్లెక్సీ వివాదం

- కాంగ్రెస్ మండలాధ్యక్షుడి అరెస్టు
- పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నేతల ధర్నా



పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

భిక్కనూరు: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ జన్మదినం సందర్భంగా మండలంలోని బస్వాపూర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొందరు కాల్చివేయగా, ఈ వ్యవహారం వివాదాస్పదమైంది. విచారణ నిమిత్తం పోలీసులు కొందరు యువకులను స్టేషన్‌కు పిలించగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తుడుం జీవన్‌తోపాటు మరికొందరు నాయకులు స్టేషన్‌కు వచ్చి.. ఫ్లెక్సీ చించేసింది మీరేనా? అంటూ చేయిచేసుకున్నారు. గురువారం రాత్రి ఇంటికి వెళ్లిన యువకులు జరిగిన విషయాన్ని తమ కుటుంబ సభ్యులతోపాటు బీఆర్ఎస్ నాయకులకు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు మాజీ విప్ గంప గోవర్ధన్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా, ఆయన ఎస్పీ సింధుశర్మతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో యువకులపై చేయిచేసుకున్న వారిపై కేసు నమోదు చేయాలని సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్‌ను ఎస్పీ ఆదేశించారు. కేసుల నమోదు విషయం షబ్బీర్ అలీ దృష్టికి వెళ్లడంతో ఆయన సీఐ, ఎస్సైతో ఫోన్‌లో మాట్లాడారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసులు నమోదు చేయాలని, చేయి చేసుకున్న వారిపైకాకుండా వేరే వారిపై కేసులు చేయొద్దని సూచించారు. దీంతో పోలీసులు భీంరెడ్డితోపాటు తుడుం జీవన్‌పై కేసు నమోదు చేశారు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. యువకులపై చేయి చేసుకున్న కాంగ్రెస్ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ద్యావర సాయిరెడ్డి, రామేశ్వర్‌పల్లి పెద్దమల్లారెడ్డి విండో చైర్మన్లు నాగార్తి భూంరెడ్డి, రాజాగౌడ్, ఎంపీటీసీ సాయాగౌడ్, నేతలు అందె మహేందర్‌రెడ్డి, వంగేటి చిన్న నర్సారెడ్డి, కర్నాల మల్లేశం, బుర్రిగోపాల్, చిన్న మద్ది సిద్ధరాములు, రాజిరెడ్డి, దుర్గాబాబు తదితరులు పాల్గొన్నారు.